సాక్షి
శ్రీకాకుళం
బుధవారం । 15 । మార్చి । 2023



నిబంధనలు తప్పనిసరి

శ్రీకాకుళం డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కూన కల్యాణి 'సాక్షి'తో మాట్లాడారు. నిబంధనలు పాటించాలని సూచించారు. - 8లో



బూడిదే మిగిలింది

కాశీబుగ్గలో జరిగిన ఓ అగ్ని ప్రమాదంలో ఇల్లు, ఫొటో స్టూడియో కాలిపోయాయి. రూ.40 లక్షల నష్టం వాటిల్లింది. - 8లో

నేడు జిల్లా సీనియర్స్ సెపక్‌తక్ర జట్ల ఎంపికలు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా సీనియర్స్ పురుషులు, మహిళల సెపక్‌తక్ర జట్ల ఎంపికలు బుధవారం జరగనున్నాయి. శ్రీకాకుళం నగరంలోని వైఎస్సార్ సర్కిల్ (ఏడురోడ్ల) కూడలిలో ఉన్న ఎన్టీఆర్ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ మైదానం వేదికగా సాయంత్రం 5 గంటల నుంచి ఎంపికల ప్రక్రియ మొదలుకానుంది. ఏర్పాట్లు పూర్తిచేశామని జిల్లా సెపకతక్ర అసోసియేషన్ చైర్మన్ ఎమ్మెస్సార్ కృష్ణమూర్తి తెలిపారు.

న్యూస్‌రీల్

వెటర్నరీ అసిస్టెంట్‌కు మెమో

సంతబొమ్మాళి: విధి నిర్వహణలో అలసత్వం వహించిన పాలతలగాం గ్రామసచివాలయ వెటర్నరీ అసిస్టెంట్ స్రవంతికి మెమో ఇచ్చామని బోరుభద్ర పశువైద్యాధికారి అప్పలసూరి మంగళవారం తెలిపారు. గొర్రెలకు వ్యాక్సిన్ వేయకుండా గొర్రెల కాపరి కర్రి అప్పన్నకు ఆ వ్యాక్సిన్‌ను వెటర్నరీ అసిస్టెంట్ స్రవంతి ఇచ్చారు. ఆ వ్యాక్సిన్‌ను మరో వ్యక్తితో గొర్రెల కాపరి పశువులకు ఇంజెక్షన్ చేయించారు. దీంతో 15 గొర్రెలు మృతి చెందగా మరో 35 గొర్రెలు అస్వస్థతకు గురయ్యాయి. దీనిపై పశుసంవర్ధక శాఖ ఏడీ రఘునాథ్ ఆధ్వర్యంలో చనిపోయిన గొర్రెలకు పోస్టుమార్టం నిర్వహించారు. విధి నిర్వహణలో ప్రతి ఒక్కరు బాధ్యతగా వ్యవహరించాలని ఆయన సూచించారు.

'నిత్యావసర సరుకులు అందించాల్సిందే'



మాట్లాడుతున్న కమిషనర్ అరుణ్‌కుమార్

శ్రీకాకుళం పాతబస్టాండ్: రైస్ కార్డు ఉన్న లబ్ధిదారులందరికీ నిత్యావసర సరుకులు అందించాల్సిన బాధ్యత అధికారులదేనని పౌర సరఫరాల శాఖ కమిషనర్ హెచ్.అరుణ్ కుమార్ స్పష్టం చేశారు. పీడీఎఫ్ అంశాలపై సంబంధిత అధికారులతో మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారులతో ఆయన సమీక్షించారు. నిత్యావసర సరుకులు బియ్యం, కందిపప్పు, పంచదార తదితర సామగ్రి పంపిణీలో ఆలస్యానికి గల కారణాలపై ఆరా తీశారు. విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించరాదని హితవు పలికారు. జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ మాట్లాడుతూ ప్రతి నెల 15వ తేదీన సమావేశం నిర్వహించాలని సూచనలు అందినట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా సరఫరాల అధికారి డీవీ రమణ, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ పి.జయంతి, సివిల్ సప్లై డీటీలు తదితరులు పాల్గొన్నారు.

ఆధార్‌కు ఓటరు గుర్తింపుకార్డు అనుసంధానం



శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో ఆధార్ కార్డుకు ఓటరు గుర్తింపు కార్డులను అనుసంధానం చేసుకోని వారందరూ తప్పనిసరిగా ఫారం -6బి ద్వారా అనుసంధానం చేసుకోవాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ ఓటర్లకు పిలుపునిచ్చారు. ఈ మేరకు సంబంధిత ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు, బీఎల్ఓలతో కలెక్టర్ మంగళవారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో ప్రతి ఓటరు స్వచ్ఛందంగా తన ఆధారు కార్డుకు ఓటరు గుర్తింపు కార్డును అనుసంధానం చేసుకోవాలని తెలిపారు. ఈ మేరకు గతంలో పిలుపునిచ్చామని గుర్తు చేశారు. కొందరు మాత్రమే అనుసంధానం చేసుకున్నారని, మిగిలిన వారు కూడా అనుసంధానించుకోవాలని సూచించారు. ఇందుకు సంబంధించి వారి పరిధిలో గల బీఎల్ఓల దగ్గరకు వెళ్లి ఫారం 6బి ద్వారా వారి ఆధార్ కు ఓటర్ ఐడీని లింక్ చేసుకోవాలని కలెక్టర్ వివరించారు.

స్టోన్ ప్లాంటేషన్ వేగవంతం కావాలి: కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో జరుగుతున్న స్టోన్ ప్లాంటేషన్ మరింత వేగవంతం కావాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సంయుక్త కలెక్టర్, సబ్ కలెక్టర్లు, ఆర్డీఓలు, తహసీల్దార్లు, సర్వేయర్లు, వీఆర్ఓలతో మంగళవారం కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్టోన్ ప్లాంటేషన్ కార్యక్రమం గతంలో వేగవంతంగా చేసినప్పటికీ, మళ్లీ వెనుకబడుతున్నామని తెలిపారు. క్షేత్రస్థాయిలో సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. పూర్తయిన పనికి చెల్లింపులు జరిగిపోయాయని చెప్పారు. వీలైనంత త్వరగా స్టోన్ ప్లాంటేషన్ చేసి వాటికి సంబంధించిన బిల్లులను తమకు సమర్పిస్తే వాటికి కూడా చెల్లింపులు చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు.

ద్విచక్ర వాహనాల వేలం

శ్రీకాకుళం క్రైమ్: ఈ నెల 17న రెండు ద్విచక్ర వాహనాలను వేలం వేయనున్నట్లు శ్రీకాకుళం ఒకటో పట్టణ సీఐ ఎస్.సన్యాసినాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు ఉదయం 10.30 గంటలకు స్టేషన్‌లో ఆవరణలో జరిగే వేలంలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

శ్వేత బంగారు స్వాగతం!

- పలాస-కాశీబుగ్గలో వినూత్న సంప్రదాయం
- జీడి ఉత్పత్తులకు ప్రాచుర్యం కల్పించే సృజనాత్మక ఆలోచన
- పూల బొకేలకు బదులు జీడిపప్పు బొకేలు, దండలు



జీడిపప్పుతో చేసిన దండలు

కాశీబుగ్గ: పలాసలో కొత్త ట్రెండ్ మొదలైంది. పూల బొకేలు, పూలమాలలకు విరామం ప్రకటిస్తూ జీడిపప్పుతో అందంగా తయారు చేసిన బొకేలు, మాలలతో స్వాగతం పలికే సంప్రదాయం మొదలైంది. రాష్ట్రపతి మొదలుకుని ముఖ్యమంత్రి, మంత్రుల వరకు అందరికీ వెల్‌కమ్ చెప్పేందుకు ఇప్పుడు జీడి బొకేలే ఫస్టు చాయిస్. జిల్లాలో అత్యధికంగా జీడి పరిశ్రమలు ఉన్న పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీతో పాటు పరిసర ప్రాంతాల వ్యాపారులు జీడికి ప్రచారం కల్పించేందుకు నూతన విధానాలు కనిపెడుతున్నారు. అందులో భాగమే ఈ స్వాగత సంప్రదాయం. ప్రపంచంలో ఎక్కడా లేనంత రుచికరమైన పప్పు ఈ ప్రాంత ప్రత్యేకత. ఆ రుచిని ఎల్లలు దాటించి అందరికీ చెప్పడానికి ఈ విధానం ఉపకరిస్తుందని వ్యాపారులు నమ్ముతున్నారు.

వ్యాపారులంతా కలిసి ఉన్న రెండు సంఘాలు ఇక్కడ పటిష్టంగా ఉన్నాయి. జీడిపప్పు కొనుగోలు చేయడంతో పాటు వాటి ప్రాసెసింగ్‌లో వేల మందికి ఉపాధి అందిస్తున్నారు. అలాంటి పరిశ్రమలు నిరాటంకంగా ముందుకు సాగాలనే తలంపుతో పలాస జీడిపప్పుకు సహకరించిన ముఖ్యనాయకులు, ముఖ్య అధికారులకు హ్యాండ్‌మేడ్ జీడిపప్పుతో తయారు చేసిన గిఫ్టులు అందిస్తున్నారు. తొలుత ఇది ఆశ్చర్యంగానే అనిపించినా రానురానూ అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సంస్కృతి ఇప్పుడు జీడిబొకేలు, బహుమతులతో కొత్త రకమైన వ్యాపారంగా మారింది.

బొకేలు, పూలదండలు తింటారు

- పూలు, ప్లాస్టిక్ పూలతో తయారు చేసిన బొకేలు, పూలదండలను అతిథులను స్వాగతించేందుకు వినియోగించడం పరిపాటి. ఇప్పుడు జీడిగుడ్డు, జీడి బద్దలతో తయారు చేసిన బొకేలు, పూలదండలు, గిఫ్ట్ బాక్సులు, టోపీలు, తోరణా లు ఆ స్థానాన్ని ఆక్రమించాయి. ఈ బహుమతులు అందుకున్న వారు వీటిని మర్చిపోలేరు. వీటిని తీక్షణంగా చూసి ఇక్కడ చరిత్రను తెలుసుకొనేందుకు ఆసక్తి చూపిన సందర్భాలు ఉన్నాయి.
- పలాసకు జీడిపారిశ్రామిక వాడ ఏర్పాటు చేసి, టాక్సులు తగ్గించిన దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పలాస వచ్చినప్పుడు ఆయనకు జీడిపప్పుతో తయారుచేసిన బహుమతులు అందించారు.
- ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పలాస వచ్చిన ప్రతిసారి ఆయనకు జీడిపప్పు బొకేలతో స్వాగతం పలికి, అనంతరం ఆయనకు వివిధ బహుమతులు రూపంలో అందించారు.
- విశాఖపట్నంకు ఉప రాష్ట్రపతి హోదాలో వెంకయ్యనాయుడు వస్తే రెండు సంఘాల తరఫున ప్రత్యేకంగా తయారు చేసిన బహుమతులు అందించారు.
- జిల్లాకు కొత్తగా ఎస్పీ, కలెక్టర్, ఇతర పెద్దస్థాయి అధికారులు వచ్చినప్పుడు వీటినే అందిస్తున్నారు.
- వివిధ పర్యటనలలో భాగంగా పలాస వచ్చే మంత్రులు, కేంద్ర మంత్రులకు జీడిపప్పు బహుమతులు అందిస్తుంటారు.

అతిథులకు ఇష్టమయ్యే ఆకృతులతో..



పలాస వచ్చే ముఖ్య అతిథులు ఎవరైనా వారు రాణించిన, ప్రస్తుతం కొనసాగుతున్న రంగాలకు సంబంధించిన వాటిని గుర్తు చేసే విధంగా వస్తువులు తయారు చేస్తాం. ఆయా శాఖలకు సూటయ్యే ఆకృతులను తయారు చేయిస్తాం. వాస్తవంగా పురుష అతిథులకు సంప్రదాయబద్ధమైన టోపీలకు జీడిపిక్కలను అద్ది వారి తలపై గౌరవంగా పెడతాం. పూర్వం రోజుల్లో రాజులను అలా గౌరవించే వారు. ఈ పద్ధతికి జీడిపప్పును జోడిస్తున్నాం. మహిళా అతిథులు ఎవరైనా వస్తే వారికి పూలబొకేలు, కూజాలు ఇతర ఆకారాలు కలిగినవి చేతికందిస్తాం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వెంకయ్యనాయుడు, పలాస వచ్చిన సినీ యాక్టర్లు అందరికీ జీడి ఉత్పత్తులతో కూడిన బహుమతులు అందిస్తున్నారు. – మల్లా సురేష్‌కుమార్, అధ్యక్షుడు, కాష్యూ మాన్యుఫ్యాక్చర్ అసోషియేషన్, పలాస

కొత్త ఆలోచనలతో..



ఒకప్పుడు అతిథులు ఎవరైనా వస్తే పూల బొకేలు, పూల దండలు ఇచ్చే ట్రెండ్ ఉండేది. జీడిపప్పుతో కూడిన బహుమతులు అందించడం మాకు అలవాటైపోయింది. ఈ ట్రెండ్ జిల్లా వ్యాప్తంగా పాకింది. హైదరాబాద్ వంటి ప్రాంతాలు వెళ్లినప్పుడు బహుమతులు వెంట తీసుకుని వెళ్లి అనేకమందికి ఇచ్చి మన ప్రాంత గొప్పదనం తెలియజేస్తుంటాం. అందుకున్న వారి షో కేస్‌లో సైతం కనపడుతుంటాయి. వీటి తయారికి కొంత మంది నిపుణులు పలాసలో ఉన్నారు. వారికి ముందస్తుగా ఆర్డర్ ఇస్తే ఇలాంటివి తయారు చేసి ఇస్తారు. తయారీకి ఎంతసమయం పట్టినా పప్పు తో ఇచ్చిన గిఫ్టుకు ఎవరైనా ఫిదా అవ్వాల్సిందే. – రోణంకి శాంతికుమారి, మాజీ కౌన్సిలర్, పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ



అందమైన పెట్టెరూపంలో బహుమతి ఇది

దండలు



- కేజీ నుంచి 2 కేజీల వరకు ఉంటుంది.
- పూలతో కలిపి తయారు చేసేందుకు రూ.700 తీసుకుంటున్నారు.
- కేజీ బరువుండే దండ ఖరీదు: రూ.1300

బొకేలు



- కేజీ జీడిపప్పు అవసరం.
- తయారీకి రూ.300
- మొత్తం బొకే ఖరీదు: రూ.1100



కిరీటం

రూ.300 నుంచి రూ.500 వరకు
ఆర్డర్‌ను బట్టి తయారు చేస్తున్నారు

ఊరి జనం ఊగేలా..



దప్పుల దరువు చెవుల్లో తుప్పు వదలగొట్టింది. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు కార్యక్రమంలో ఈ ఏడేళ్ల బాలుడి తీన్‌మార్ మోత అందరినీ ఆకర్షించింది. బృందంతో సమానంగా బాలుడు కూడా దప్పు వాయిస్తూ ఆకట్టుకున్నాడు.
– సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం

90.2% మందికి మాత్రల పంపిణీ

- నులి పురుగుల నిర్మూలనే లక్ష్యం కావాలి: కలెక్టర్



విద్యార్థినికి అల్బెండజోల్ మాత్ర వేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం న్యూకాలనీ: నులి పురుగుల నిర్మూలనే ధ్యేయంగా వైద్యారోగ్య శాఖ, విద్యాశాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ పేర్కొన్నారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవంలో భాగంగా మంగళవారం శ్రీకాకుళం నగరంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాతూ 2 ఏళ్ల పైబడి 19 ఏళ్ల లోపు వయస్సు కలిగిన వారంతా ఆల్బెండజోల్ మాత్ర వేసుకోవాలని సూచించారు. స్కూల్‌కు వెళ్లని పిల్లలకు కూడా మాత్రలు పంపిణీ చేయాలని అధికారులకు సూచించారు. జిల్లాలో 4 లక్షల 40 వేల మంది పిల్లలు ఉన్నట్లు కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ చెప్పారు. నులిపురుగులు సోకిన పిల్లలు, కిశోర బాలలు ప్రమాదకరమైన ఆరోగ్య సమస్యలను ఎదుర్కోకుండా ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ బొడ్డేపల్లి మీనాక్షి మాట్లాడుతూ నులిపురుగుల నిర్మూలనకు చేపడుతున్న కార్యక్రమాలను, ఏర్పాట్లను వివరించారు. పాఠశాలల్లో నులిపురుగుల మాత్రల పంపిణీకి హెచ్ఎంలు, ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి గార పగడాలమ్మ సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థినులకు మాత్రలు వేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ అనురాధ, డాక్టర్ శ్రీదేవి, పాఠశాల హెచ్ఎం ఎం.వాగ్దేవి, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ జంపు కృష్ణమోహన్, డాక్టర్ అప్పారావు, జిల్లా ఇమ్యూనైజేషన్ మేనేజర్ అప్పలనాయుడు, సోషల్ వర్కర్ మంత్రి వెంకటస్వామి, 104 మొబైల్ మెడికల్ యూనిట్ జిల్లా కో ఆర్డినేటర్ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు. జిల్లా వ్యాప్తంగా 90.2 శాతం అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసినట్టు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బొడ్డేపల్లి మీనాక్షి తెలిపారు. మంగళవారం 4,04,334 మంది విద్యార్థులు మాత్రలు వేసుకున్నట్టు చెప్పారు. మిగిలిన బాలలు, విద్యార్థులకు ఈనెల 18వ తేదీన మాత్రలు అందిస్తామన్నారు.

ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

- నేటి నుంచి మొదలుకానున్న ఇంటర్మీడియెట్ పరీక్షలు
- నో సెల్‌ఫోన్ జోన్లుగా పరీక్ష కేంద్రాలు



ప్రభుత్వం సమకూర్చిన ఫోన్

శ్రీకాకుళం న్యూకాలనీ: ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలకు సర్వం సిద్ధమైంది. జిల్లాలో బుధవారం నుంచి ఇంటర్మీడియెట్ పరీక్షలు మొదలుకానున్నాయి. ఇందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. ఉదయం 9 గంటల నుంచి మొదలయ్యే ఈ పరీక్షలకు విద్యార్థులతోపాటు ఇన్విజిలేటర్లు, డీవోలు, చివరకు చీఫ్ సూపరింటెండెంట్ కూడా సెల్‌ఫోన్ వాడటానికి వీల్లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇంటర్ పరీక్ష కేంద్రాలను నో సెల్‌ఫోన్ జోన్లుగా ప్రకటించారు. చీఫ్ సూపరింటెండెంట్లకు కీప్యాడ్ ఫోన్లను ప్రభుత్వం ఇప్పటికే సమకూర్చింది. అది కూడా పరీక్ష మొదలైన మొదటి గంట కాలంపాటే వినియోగించాలని అధికారులు స్పష్టం చేస్తున్నారు. కీప్యాడ్ ఫోన్‌లను ప్రభుత్వం వాస్తవానికి గత ఏడాదే పబ్లిక్ పరీక్షలకు వినియోగించాలని భావించింది. అయితే కొన్నిచోట్ల వాడలేదు. కానీ ఈ ఏడాది మాత్రం పక్కాగా అమలు చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.



పరీక్ష కేంద్రాలకు అరగంట ముందే చేరుకోవాలి..

ఇంటర్ పరీక్షలు ప్రతిరోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరగనున్నాయని జిల్లా ఆర్ఐఓ/డీఈసీ కన్వీనర్ ఎస్.తవిటినాయుడు తెలిపారు. ఈ మేరకు ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ 9 గంటల తర్వాత నిమిషం ఆలస్యమైనా పరీక్ష రాసేందుకు అనుమతించబోమని స్పష్టంచేశారు. జిల్లాలో ఇంటర్ పరీక్షలకు రికార్డుస్థాయిలో 109 కేంద్రాలను కేటాయించామని తెలిపారు.

నేటి నుంచి డిగ్రీ మూడు, ఐదు సెమిస్టర్ పరీక్షలు



ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పరిధిలో బుధవారం నుంచి మూడు, ఐదు సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు చేశారు. మూడో సెమిస్టర్‌కు సంబంధించి రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షలు కాగా, ఐదో సెమిస్టర్‌కు సంబంధించి సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నారు. మూడో సెమిస్టర్ ఉదయం 2 నుంచి 5 గంటల వరకు నిర్వహించనున్నారు. 12,440 మంది పరీక్షకు హాజరుకానున్నారు. 66 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించనున్నారు. డిగ్రీ ఐదో సెమిస్టర్ సప్లిమెంటరీకి సంబంధించి 20 పరీక్ష కేంద్రాల్లో 5200 మంది పరీక్షకు హాజరు కానున్నారు. ఈ పరీక్షలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరగనున్నాయి. ఈ నెల 29 వర కు పరీక్షలు నిర్వహించనున్నారు. మాస్ కాపీయింగ్ నియంత్రణకు ప్రత్యేక పరిశీలకులను నియమించినట్లు ఎగ్జామినేషన్స్ డీన్ డాక్టర్ ఎస్.ఉదయ్ భాస్కర్ చెప్పారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేశామన్నారు.

'ఫైర్'.. సూపర్!

- వేసవిలో అగ్ని ప్రమాదాలు ఎదుర్కొనేందుకు అగ్ని మాపక శాఖ సిద్ధం
- అందుబాటులో అధునాతన పరికరాలు, వాహనాలు
- పూర్తిస్థాయిలో సిబ్బంది



శ్రీకాకుళం క్రైమ్ : జీడితోటల్లో కార్చిచ్చులు మొదలయ్యాయి. అక్కడక్కడా గడ్డివాములు కూడా దగ్ధమవుతున్నాయి. ఇంకా వేసవి ప్రారంభం కాకమునుపే ప్రమాదాలు జరుగుతుండడంతో అగ్నిమాపక అధికారులు తమ సన్నద్ధతను పరీక్షించుకుంటున్నారు. రానున్న వేసవిలో అగ్ని ప్రమాదాలను ఎదుర్కొనేందుకు జిల్లా అగ్నిమాపక శాఖ సర్వం సిద్ధంగా ఉంది. జిల్లాలో పది ప్రభుత్వ అగ్నిమాపక కార్యాలయాలు ఉన్నాయి. జిల్లాలో 160 మంది ప్రభుత్వ, 32 మంది ప్రైవేటు సిబ్బంది ఉన్నారు. ప్రమాద నివారణకు అవసరమైన పరికరాలు, యంత్రాలు, ఇంజిన్లు సిద్ధంగా ఉన్నాయి. కాలం చెల్లిన రెండు ఇంజిన్ల స్థానంలో కొత్తవాటి ఏర్పాటుకు, రెండు ఔట్‌పోస్టు కార్యాలయాలను పర్మినెంటు చేయడానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు అధికారులు చెబుతున్నారు.

దండిగా సిబ్బంది..

జిల్లాలో ఒక జిల్లా అగ్నిమాపక అధికారి, ఇద్దరు జిల్లా సహాయ అగ్నిమాపక అధికారులు, ఏడుగురు కేంద్రాధికారులతో కలిపి మొత్తం 116 మంది సిబ్బంది ఉన్నారు. ఆరుగురు రెగ్యులర్ ఫైర్ హోంగార్డులు, డిప్యుటేషన్ విధుల్లో ఉన్నవారు 10 మంది కాగా, పోలీసు హోంగార్డులు 44 మంది రొటేషన్ పద్ధతిలో ఉన్నారు. ఔట్ పోస్టు కార్యాలయాలైన మందస, పొందూరు పరిధిలో 32 మంది ప్రైవేటు సిబ్బంది పనిచేస్తున్నారు. ఈ ఔట్ పోస్టులను నెలకోసారి జిల్లా అగ్నిమాపక అధికారి కానీ, సహాయ అధికారి గానీ తనిఖీ చేస్తుంటారు.

పరికరాలివే..



అడ్వాన్స్ వాటర్ టెండరింగ్ ఫైర్ ఇంజిన్ నీటి సామర్థ్యం 4,500 లీటర్లు. సాధారణంగా వాటర్ ట్రెండింగ్ ఇంజిన్‌లో కిందనుంచి వాటర్ ప్రెజర్ కొడతారు. దీనికైతే పైన హ్యాండిల్ పట్టుకుని వాటర్ కొట్టవచ్చు. ఫోమ్, కార్బన్‌డైఆక్సైడ్ ఉంటుంది.



రెస్క్యూ ఫైర్ ఇంజిన్ దీని నీటి సామర్థ్యం 4,500 లీటర్లు. ఇది రోడ్డు, రైళ్లు, వరదలు, భూకంప ప్రమాదాలు సంభవించినప్పుడు ఉపయోగపడుతుంది. హైడ్రాలిక్ ఎక్విప్‌మెంట్ ద్వారా రైలు భోగీలు కట్ చేస్తాయి. నదుల్లో, వాగుల్లో చిక్కుకుపోయే వారి జాడ తెలుసుకోవడానికి బ్రీతింగ్ ఆపరేటర్ ఉంటుంది. వారిని చూసేందుకు విడ్తింగ్ లొకేషన్ కెమెరా ఉంటుంది. బిల్డింగ్ బీమ్‌ల ఐరన్ కట్ చేయడానికి ఎలక్ట్రిక్, పెట్రోలుతో నడిచే రంపాలుంటాయి. ప్రమాదాన్ని బట్టి ఫైర్ సూట్, కెమికల్ సూట్ వేసుకుంటారు. ఒక జనరేటర్ ఉంటుంది.



ట్రూప్ క్యారియర్ ప్రమాదం సంభవించే ప్రాంతానికి అప్పటికప్పుడు సిబ్బంది వెళ్లేందుకు ప్రయాణంలో ఉపయోగపడేదే ట్రూప్ క్యారియర్. 30 మంది సిబ్బంది ఇందులో వెళ్లవచ్చు.

ఫైర్ బుల్లెట్ బైక్ ఇదికూడా ఇరుకైన సందుల్లోంచి వెళ్లడానికి వీలుగా ఉంటుంది. 10 లీటర్ల ఫోమ్‌తో కూడిన నీళ్లుంటాయి. రెండు సిలిండర్లు ఉంటాయి.



వాటర్ టెండరింగ్ ఫైర్ ఇంజిన్

దీని నీటి సామర్థ్యం 4,500 లీటర్లు. రోడ్డు ప్రమా దాలు జరిగినప్పుడు వాహనాలు ఇరుక్కున్నా, నీటిలో మునిగిన వాహనాలను బయటకు తీయాలన్నా దీన్ని ఉపయోగిస్తారు. దీన్ని ఎలక్ట్రిక్ రిమోట్ సాయంతో ఆపరేటర్ చేస్తారు. ఆయిల్ ప్రమాదాలు (పెట్రోల్, డీజిల్, ట్రాన్స్‌ఫార్మర్లకు సంబంధించి) ఫోమ్ మేకింగ్ బ్రాంచిని ఉపయోగించి ఫోమ్‌ను స్ప్రే చేస్తారు. నీటి సరఫరా చేసే డెలివరీ హోజెస్ పైపులు, హౌజ్‌రీల్ అనేది 50 మీటర్ల పొడవు ఉంటుంది. బ్యాక్ మౌంటెడ్ సెంట్రీ ఫీజల్ పంప్ ఉంటుంది. వాటర్ టెండర్‌కు ఇది గుండె లాంటిది. నీళ్లను స్ప్రే చేయాలన్నా.. నీటిని వాటర్ ట్యాంకులోకి నింపాలన్నా ఉపయోగిస్తారు. ఆపరేట్ చేయడానికి సెపరేటుగా ఫైర్‌మెన్ ఉంటారు.

మిస్ట్ జీప్ ఇది కాన్వాయ్‌లో ఉపయోగపడుతుంది. మినీ ఫైర్ ఇంజిన్ అని కూడా అంటారు. 200 లీటర్ల నీటి సామర్థ్యం ఉంటుంది. మిస్ట్ గన్‌తో ఫైర్‌ను ఆపుతారు. ఈ గన్ నుంచి వెలువడే ఒక నీటి బిందువు అనేక మిల్లీ మైక్రాన్ అణువులుగా ఏర్పడి మంటలను ఆర్పుతుంది. చిన్న చిన్న సందుల్లోంచి వెళ్లేందుకు వీలుగా ఉంటుంది.



అప్రమత్తంగా ఉండాలి..



రానున్నది వేసవి. అగ్ని ప్రమాదాలపై అధికారులు అప్రమత్తంగా ఉండాలి. అత్యవసర పరిస్థితుల్లో తప్ప సెలవు పెట్టకూడదు. జిల్లాకు సంబంధించి ఎనిమిది మంది ఫైర్ ఆఫీసర్లకు ప్రభుత్వం ట్యాబ్‌లు ఇచ్చింది. ప్రమాద స్థలం నుంచి ట్యాబ్‌లో ఫొటోలు అప్‌లోడ్ చేయాలి.
– వీరభద్రరావు, జిల్లా అగ్నిమాపకాధికారి, శ్రీకాకుళం

ప్రణాళికతో ప్రమాదాల నివారణ



నా పరిధి ఆరు జిల్లాలు ఉన్నాయి. ప్రతీ నెల జూమ్ వీడియో కాన్ఫరెన్సు ద్వారా శ్రీకాకుళం జిల్లా అధికారులతో సమీక్ష జరుపుతాను. పక్కా ప్రణాళికతో ప్రమాదాలు నివారిస్తాం. కేంద్రప్రభుత్వం ఏప్రిల్ 14 నుంచి వారంరోజుల పాటు నిర్వహించే అగ్నిమాపక వారోత్సవాలకు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నాం. మందస, పొందూరు ఔటు పోస్టు కార్యాలయాలను శాశ్వత కేంద్రాలుగా మార్చే యోచనలో ఉన్నాం.
– డి.నిరంజన్‌రెడ్డి, విశాఖపట్నం ప్రాంతీయ అగ్నిమాపక అధికారి

క్లుప్తంగా

నేడు వైజయంతి ఉత్సవ వేదిక ప్రారంభోత్సవం



అరసవల్లిలో నిర్మించిన ఉత్సవ వేదిక

అరసవల్లి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయ ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు వీలుగా శ్రీవైజయంతి ఉత్సవ వేదిక సిద్ధమైంది. వసతి గదులు, మరుగుదొడ్లు వంటి సౌకర్యాలతో పాటు సుమారు వెయ్యి మంది ప్రేక్షకులు కూర్చునేలా స్థలం, విద్యుత్ అలంకరణకు వీలుగా వేదికను రూపొందించారు. జిల్లాలో ప్రముఖ కళాకారులతో ప్రత్యేక గోష్టి కార్యక్రమంతోనే వేదికను నేటి ఉదయం ప్రారంభించనున్నారు. ఈవో వి.హరిసూర్యప్రకాష్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మలు తగిన ఏర్పాట్లు చేశారు. కొన్నాళ్ల క్రితం ట్రిమాక్స్ పరిశ్రమ యాజమాన్యం నిర్మించిన ఈ వేదిక అసంపూర్తిగానే ఉండిపోయిన సంగతి విదితమే. ఈ నేపథ్యంలో ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ బాధ్యత తీసుకుని నిర్మాణాన్ని పూర్తి చేయించారు. బుధవారం ఉదయం కళాకారుల గోష్టి నిర్వహించనున్న నేపథ్యంలో వేదిక ఏర్పాట్లను ప్రధానార్చకులు శంకరశర్మ, ఈవో హరిసూర్యప్రకాష్, నేతేటి హరిప్రసాద్‌శర్మలు పర్యవేక్షించారు.

ఆదిత్య అధ్యాపకునికి సీవీ రామన్ అవార్డు



శాంతికుమార్‌ను అభినందిస్తున్న కళాశాల డైరెక్టర్ నాగేశ్వరరావు

టెక్కలి: టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల అధ్యాపకుడు ఆర్.శాంతికుమార్‌కు కేరళ రాష్ట్రం నుంచి సి.వి.రామన్ అవార్డుకు ఎంపికైనట్లు కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు మంగళవారం తెలిపారు. కాస్మాలజీ, రిలేటివిటీ అంశాలపై శాంతికుమార్ చేసిన పరిశోధనలకు కేరళకు చెందిన ఇనిస్టిట్యూట్ ఆఫ్ రీసెర్చ్ సెంటర్ ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. శాంతికుమార్‌ను ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, అధ్యాపకులు లక్ష్మణరావు, ప్రొఫెసర్ ఎం.రమణయ్య తదితరులు అభినందించారు.

బీఎస్పీ జిల్లా అధ్యక్షునిగా నారాయణరావు



బోకర నారాయణరావును అభినందిస్తున్న నాయకులు

టెక్కలి: బహుజన్ సమాజ్ వాదీ పార్టీ జిల్లా అధ్యక్షునిగా టెక్కలికి చెందిన బోకర నారాయణరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో రాష్ట్ర అధ్యక్షుడు పరంజ్యోతి ఆధ్వర్యంలో ఈ ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర, జిల్లా పార్టీ నాయకులు నారాయణరావును అభినందించారు.

నరేంద్రకుమార్ మృతిపై విచారణ జరపాలి

ఎచ్చెర్ల క్యాంపస్: చిలకపాలెంకు చెందిన దళిత యువకుడు లింగాల నరేంద్రకుమార్ మృతిపై విచారణ జరిపించాలని దళిత సంఘాల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం చిలకపాలెంలోని మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం శ్రీకాకుళం డీఎస్పీ ఎం.మహేంద్రకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కంత వేణు, డి.రామప్పడు, లింగాల గరికివాడు, సోమేశ్వరరావు పాల్గొన్నారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24క్యా. 10గ్రా.)	56,150–00
బంగారం(22క్యా. 10గ్రా.)	51,800–00
వెండి (కిలో)	71,200–00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 420.00
విజయనగరం	రూ. 424.00
శ్రీకాకుళం	రూ. 424.00

చికెన్

బ్రాయిలర్		
లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹120	₹195	₹ 215

నిబంధనలు తప్పనిసరి

- మెడికల్ షాపుల లైసెన్స్ రెన్యువల్ చేసుకోవాలి
- మందుల ధరల్లో తేడా ఉండకూడదు
- 'సాక్షి'తో శ్రీకాకుళం డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కూన కల్యాణి



శ్రీకాకుళం క్రైమ్: నిబంధనలకు విరుద్ధంగా నడిపే మెడికల్ షాపులు, కంపెనీలపై చర్యలు తప్పవని శ్రీకాకుళం డ్రగ్స్ కంట్రోల్ శాఖ ఇన్‌స్పెక్టర్ కూన కల్యాణి స్పష్టం చేశారు. మ్యానుఫ్యాక్చరింగ్, సరఫరా, అమ్మకాలు, ధరలు, అడ్వర్‌టైజ్‌మెంట్లలో ఏమాత్రం తేడా వచ్చినా సహించేది లేదని, కాస్మొటిక్స్ విషయంలోనూ ఇదే వర్తిస్తుందని చెప్పారు. మంగళవారం 'సాక్షి'తో ఆమె ప్రత్యేకంగా మాట్లాడారు.

సాక్షి : మెడిసిన్ తయారీకి అనుమతులెలా?

అధికారి: డ్రగ్‌లో బ్రాండెడ్, జనరిక్ రకాలుంటాయి. కొన్ని కంపెనీలు రూ.లక్షలు ఖర్చు పెట్టి రీసెర్చ్ జరిపి ప్రయోగాలు చేస్తూ ఓ డ్రగ్‌ను కనిపెడతారు. అలాంటి వారికి 20 ఏళ్లు.. 15 ఏళ్లు.. అలా మార్కెటింగ్ చేసుకోమని ఆర్‌ఎన్‌డీ (రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ యూనిట్) పేటెంట్ హక్కులు ఇస్తుంది. వారి నుంచి దేశ విదేశాలకు ఎగుమతి అవుతుంది.

సాక్షి: మన జిల్లాలో అలాంటి కంపెనీలున్నాయా..?

అధికారి: సెజ్ పరిధిలో రెడ్డీస్ యూనిట్, ప్రభుత్వానికి సంబంధించిన కంట్రోల్ యూనిట్ ఉంది. సీటీఓ బల్క్ డ్రగ్ పార్సిల్ చేసి మ్యానుఫాక్చరింగ్ యూనిట్లకు పంపుతారు. ఫార్ములేషన్ ద్వారా బల్క్ డ్రగ్ పౌడర్‌ను యాక్టివేట్ చేసి దానికి వెయిట్ వచ్చేలా ప్యాకింగ్ చేస్తారు.

సాక్షి : అమ్మకాలు ఎలా?

అధికారి: సేల్స్ ఆఫ్ డ్రగ్ మార్కెటింగ్ ట్రైల్ ఉంటుంది. దీనిలో భాగంగా ఎంఆర్‌పీ, రీటైల్, హోల్‌సేల్ ధరలకు అమ్మకాలు జరుపుతారు.

సాక్షి : ఏయే సందర్భాల్లో తనిఖీలకు వెళ్తారు?

అధికారి: నిబంధనలు పాటించని (షాప్ లైసెన్సు రెన్యువల్ ఐదేళ్లకోసారి చేయాలి, షాపు నడిపేవారికి డీ–ఫార్మసీ సర్టిఫికెట్ ఉండాలి) మెడికల్ షాపులను సీజ్ చేస్తాం. మెడిషన్‌లో నాణ్యత, స్టాండర్డ్స్‌లో లోపాలు, స్టోరేజ్‌లో తేడాలుంటే ఫార్మసీ సీజ్ చేస్తాం. కేసు వేసి కోర్టులో సమర్పిస్తాం.

సాక్షి : ఇంకా ఎలాంటి చర్యలు తీసుకుంటారు?

అధికారి: నాతో పాటు సెంట్రల్ టీమ్ నుంచి సీడీఎస్‌ఓ తనిఖీలకు వస్తుంటారు. బ్లడ్ బ్యాంకులకు వెళ్లి శాంపిల్స్ సేకరిస్తాం. ప్రభుత్వం పరిధిలో అనుమానాస్పదంగా ఉంటే టెండర్ల ద్వారా డంప్ చేస్తాం. లేబుల్ శాంపిల్స్ విజయవాడ పంపించి మంచివా.. కాదా అనేది విచారణ జరుపుతాం. ఎవరైనా తయారుచేసినవైతే ప్రాసిక్యూషన్‌కు కోర్టులో కేసు వేస్తాం.

సాక్షి : ఈ మధ్య ఏమైనా కేసులు నమోదయ్యాయా?

అధికారి: వితౌట్ లైసెన్సుకు సంబంధించి ఐదు నేర విచారణలో రుజువైనందున రూ.20 వేలు జరిమానా, మూడు నుంచి ఐదేళ్ల జైలు శిక్ష పడింది. ఫిబ్రవరి 27న ఉత్తరాఖండ్‌కు చెందిన విలిన్ బయోమేడ్ కంపెనీ సరఫరా చేయడంతో కేసు నమోదు చేశాం. భారత సాల్ట్స్ అండ్ కెమికల్స్ ఒడిశా వారు ప్రోపర్ లేబుల్ సరిగా లేనందున కేసు నమోదు చేశాం.

సాక్షి : మీ కుటుంబ నేపథ్యం?

అధికారి: మాది పొందూరు మండలం తాడివలస సమీపంలోని గోరింట. నాన్న ప్రభుత్వ తెలుగు ఉపాధ్యాయునిగా సిరిపురంలో పనిచేశారు. ముగ్గురు కుమార్తెలం. చదువులో ఎక్కడా రాజీ పడలేదు. నాన్న ప్రోత్సాహంతో కష్టపడి చదివా. ఎం ఫార్మసీ ఎంట్రెన్స్ గేట్ పరీక్షలో 150వ ర్యాంకు సాధించా. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన పీజీసెట్‌లో అత్యుత్తమంగా రెండో ర్యాంకు వచ్చింది. గౌహతిలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫార్మసీ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (ఎన్‌ఐపీఈఆర్)సెంటర్‌లో పీజీ చదివా. నా భర్త వెటర్నరీలో ముందుగా జాబ్ చేసి ప్రస్తుతం ఇండియన్ రెవెన్యూ సర్వీస్‌లో ఇన్‌కం టాక్స్ డిప్యూటీ కమిషనర్‌గా చేస్తున్నారు. బాబుకు ఆరేళ్లు. మూడోతరగతి చదువుతున్నాడు.

సాక్షి : ఉద్యోగ నేపథ్యం ?

అధికారి: 2012లో ఏపీపీఎస్సీ నోటిఫికేషన్ రావడంతో ప్రిలిమ్స్, మెయిన్స్ రాశా. ఓపెన్ క్యాటగిరిలో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ జాబ్ వచ్చింది. 2013లో టెక్కలిలో రెగ్యులర్ డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌గా తొలిసారి ఉద్యోగ బాధ్యతలు చేపట్టాను. ప్రస్తుతం శ్రీకాకుళం డివిజన్ డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌గా ఉన్నా టెక్కలి, పలాస డివిజన్లకు కూడా ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నా.



● ఆస్కార్ వచ్చిన వేళ..!

తెలుగు సినిమా ఆర్‌ఆర్‌ఆర్‌లో 'నాటు నాటు' పాటకు ఆస్కార్ అవార్డు దక్కిన నేపథ్యంలో దేశవ్యాప్తంగా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. మంగళవారం కవిటి మండలం కొత్తకొజ్జీరియా ఉన్నత పాఠశాలలో చిత్రంలోని కొన్ని కీలక సన్నివేశాల్ని చిన్నారులు ఆసక్తికరంగా ప్రదర్శించారు. ఉపాధ్యాయులు మురపాల జగన్నాథం, నిరంజన్ ఖడంగా, చలపతిరావు తదితరులు చిన్నారుల నైపుణ్యాన్ని ప్రశంసించారు. – కవిటి

యాదవకుల పక్షపాతి సీఎం జగన్



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి నర్తు రామారావు

కవిటి: స్వాతంత్ర్యానంతరం నుంచి ఇప్పటి వరకు శ్రీకాకుళం జిల్లాలో యాదవులకు చట్టసభల్లో సముచిత స్థానం కల్పించిన ఘనత సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందని శ్రీకాకుళం స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థి నర్తు రామారావు అన్నారు. మంగళవారం కవిటి మండలం కొత్తపుట్టుగలోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో నామినేషన్ల ఘట్టం నుంచి పోలింగ్ పూర్తి అయ్యేవరకు ఎమ్మెల్సీగా తన విజయంకోసం అహర్నిశలు శ్రమించిన జిల్లా పార్టీ నాయకత్వానికి, ప్రత్యేకించి ఓటువేసిన ఎమ్మెల్యేలు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు తదితర ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీకి అందించిన సేవలు గుర్తించి తనకు ఎమ్మెల్సీ టికెట్ ఇచ్చి యాదవ కుల పక్షపాతిగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారని రామారావు పేర్కొన్నారు. సమావేశంలో పార్టీ నేతలు పీఎం తిలక్, నర్తు చామంతి, ఇప్పిలి కృష్ణారావు, ఎన్ని అశోక్, దువ్వు కృష్ణారెడ్డి, రవిప్రధాన్, బి.మురళి, ఉప్పాడ శేషయ్య, తులసీదాస్, నర్తు జగన్నాథరావు తదితరులు పాల్గొన్నారు.

కోలుకుంటున్న హాస్టల్ విద్యార్థులు



విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి తెలుసుకుంటున్న అధికారులు

టెక్కలి రూరల్: మండలంలోని పోలవరం బీసీ బాలుర వసతి గృహానికి చెందిన 39 మంది విద్యార్థులు సోమవారం తీవ్ర అస్వస్థతకు గురై టెక్కలి జిల్లా ఆసుపత్రిలో చేరిన సంగతి తెలిసిందే. మంగళవారం 32 మంది విద్యార్థుల ఆరోగ్యం కుదుటపడటంతో ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ చేశారు. అయితే మంగళవారం కూడా మరో ఇద్దరు విద్యార్థులు కడుపులో నొప్పి, వాంతులు, విరోచనాలతో టెక్కలి జిల్లా ఆసుపత్రిలో చేరారు. ప్రస్తుతం ఆసుపత్రిలో తొమ్మిది మంది విద్యార్థులు చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.మీనాక్షి సోమవారం అర్ధరాత్రే టెక్కలి జిల్లా ఆసుపత్రిని సందర్శించారు. విద్యార్థుల ఆరోగ్యంపై ఆరా తీశారు. అక్కడి నుంచి పోలవరం వెళ్లి మిగిలిన విద్యార్థులతో మాట్లాడారు. మంగళవారం డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ లక్ష్మీతులసి, జిల్లా బీసీ సంక్షేమ శాఖాధికారి ఈ.అనురాధ, అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ అధికారి టి.త్రినాథరావులు ఆస్పత్రికి వచ్చి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఫుడ్ పాయిజినింగ్‌తో పాటు తాగునీరు కూడా కలుషితమై ఉండవచ్చని వైద్యులు, అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతానికి వసతి గృహంలో విద్యార్థులంతా ఆరోగ్యంగానే ఉన్నారని వార్డెన్ టి.అప్పారావు తెలిపారు.

గర్భిణిని ఆదుకున్న 108



అంబులెన్స్‌లో మగబిడ్డకు జన్మనిచ్చిన పావని

మందస: గిరిజన ప్రాంతాల్లో 108 అంబులెన్స్ సేవలు ఎంతగానో మేలు చేస్తున్నాయి. మందస మండలం హంసరాళి పంచాయతీ గిరిజన గ్రామమైన టుబ్బూరుకు చెందిన పి.పావని అనే గర్భిణికి పురిటినొప్పులు ప్రారంభమయ్యాయి. సమీపంలో ఆస్పత్రి లేకపోవడంతో 108 వాహనానికి సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న ఈఎంటీ శంకర్, పైలట్ మురళీమోహన్ హుటాహుటిన టుబ్బూరు చేరుకుని.. పావనిని అంబులెన్స్‌లో ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా, నొప్పులు అధికంగా కావడంతో మార్గంమధ్యలో ప్రసవం చేయించారు. పావని, బిడ్డ క్షేమంగా ఉండడంతో పలాస ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలు



నుజ్జు నుజ్జయిన కారు

తగరపువలస: కారును లారీ ఢీకొన్న సంఘటనలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. సంగివలస వద్ద జాతీయ రహదారిపై మంగళవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. గార మండలం బూరవిల్లికి చెందిన మళ్ల రవికుమార్(42), మళ్ల అనూష(30), బొడ్డ లక్ష్మీప్రసన్న(38) విశాఖలో వివాహ కార్యక్రమానికి హాజరయ్యేందుకు కారులో బయలుదేరారు. సంగివలస వద్ద జాతీయ రహదారిపై వెనుక నుంచి వచ్చిన లారీ అదుపు తప్పి కారును ఢీకొని డివైడర్‌ను రాసుకుంటూ ఎడమవైపు రెయిలింగ్‌ను ఢీకొట్టి ముందు చక్రం ఊడటంతో ఆగిపోయింది. ఈ ప్రమాదంలో కారు నుజ్జునుజ్జయింది. కారు స్టీరింగ్‌కు, సీటుకు మధ్య ఇరుక్కుపోయి రక్తమోడుతున్న రవికుమార్‌ను స్థానికులు అతి కష్టం మీద బయటకు తీశారు. కారులోని ఉన్న మిగిలిన ఇద్దరు క్షతగాత్రులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ముగ్గురిని ట్రాఫిక్ పోలీసుల సాయంతో స్థానికులు సంగివలస అనిల్ నీరుకొండ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం రవికుమార్ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉంది. భీమిలి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బూడిదే మిగిలింది!



ఫొటోస్టూడియోలో కాలిబూడిదైన వస్తువులు



దగ్ధమైన గాజులషాపు

- ఇల్లు, ఫొటో స్టూడియో, బ్యాంగిల్ షాపు దగ్ధం
- రూ.40 లక్షల మేర ఆస్తి నష్టం

కాశీబుగ్గ: మున్సిపాలిటీ పరిధిలోని ఎంపీడీఓ కార్యాలయం రోడ్డులో మంగళవారం వేకువజామున జరిగిన అగ్ని ప్రమాదంలో ఇల్లు, ఫొటోస్టూడియో, బ్యాంగిల్ స్టోర్ దగ్ధమయ్యాయి. ఈ ఘటనలో సుమారు రూ.40 లక్షల మేర ఆస్తి నష్టం జరిగినట్లు అంచనా వేస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. బాడ ఈశ్వరవరప్రసాద్ ఇంట్లో మంగళవారం వేకువజామున 4 గంటల సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ఏర్పడి మంటలు చెలరేగాయి. ఆ సమయంలో వాకింగ్‌కు వెళ్తున్న అగ్నిమాపక సిబ్బంది మంటలు, దట్టమైన పొగలు గుర్తించి వెంటనే ఫైరింజన్‌ను ఘటనా స్థలానికి తెప్పించారు. తలుపులు పగలగొట్టి లోపలికి వెళ్లి చూడగా ఎవరూ లేకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు. అనంతరం మంటలు అదుపుచేశారు. అప్పటికే సామాన్లు కాలిబూడిదకాగా ఎదురుగా ఉన్న ఫొటో స్టూడియోకు మంటలు అంటుకున్నాయి. స్టూడియోలో ఉన్న రూ.3 లక్షల విలువైన కెమెరా, రూ.6 లక్షల విలువైన ట్విస్టర్ మిక్సర్, ఇతర సామగ్రితో పాటు పక్కనే ఉన్న బ్యాంగిల్ షాపు కాలిపోయింది. రెండు షాపులు, ఇల్లు కాలిపోవడంతో రూ.40 లక్షల వరకు ఆస్తినష్టం జరిగినట్లు అంచనా వేస్తున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఇంట్లో ఉన్న వారు సొంతగ్రామాలకు వెళ్లడంతో ప్రాణాపాయం తప్పిందని అగ్నిమాపక సిబ్బంది తెలిపారు. ఎస్‌ఎఫ్ బి.సోమేశ్వరరావు ఆదేశాల మేరకు ఎల్‌ఎఫ్ కె.యుగంధర్, ఆపరేటర్ జి.ప్రేమ్‌కుమార్, హోంగార్డులు మంటలను అదుపు చేశారు. బాధితులకు సృష్టి ఐక్యతా ఫొటో, వీడియో అసోసియేషన్ సభ్యులు రూ.20 వేల సాయం అందించారు.

భద్రతా ప్రమాణాలు కీలకం

ఎచ్చెర్ల క్యాంపస్: పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు కీలకమని జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ జె.శివశంకరరెడ్డి అన్నారు. ఎచ్చెర్ల మండలం అరిణాం అక్కివలసలోని నాగార్జునా అగ్రికెం పరిశ్రమలో మంగళవారం జాతీయ భద్రత వారోత్సవాల్లో భాగంగా భద్రతా పరికరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమలో పనిచేసేవారికి పటిష్ట భద్రత అవసరమని చెప్పారు. ఎన్‌ఏసీఎల్ ఉత్తమ భద్రత ప్రమాణాల్లో కాన్ఫిడరేషన్ ఆఫ్ ఇండియాన్ ఇండస్ట్రీ గుర్తింపు లభించిందని, మెరుగైన ప్రమాణాలతో పరిశ్రమలు ప్రగతి సాధిస్తాయని తెలిపారు. డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ పీవీఎస్ నారాయణ మాట్లాడుతూ ఉద్యోగులు, కార్మికులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. చిన్నపాటి నిర్లక్ష్యం సైతం ఒక్కోసారి సమస్యగా మారుతుందన్నారు. పరిశ్రమ ఉపాధ్యక్షుడు కె.శేషగిరిరావు మాట్లాడుతూ పరిశ్రమలో భద్రతకు ప్రాధాన్యమిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పరిశ్రమ అధికారులు కె.శ్యాంప్రసాద్, పీఎస్‌వీఎస్‌వీఎస్ వర్మ, వి.గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శివశంకరరెడ్డి

చైతన్యంతోనే మోసాలకు అడ్డుకట్ట

- వస్తువు నాణ్యతలో తేడాలుంటే ఫిర్యాదు చేయాలంటున్న నిపుణులు
- నేడు వినియోగదారుల దినోత్సవం



శ్రీకాకుళం పాతబస్టాండ్: నిత్యజీవితంలో వినియోగించే ప్రతి వస్తువు నాణ్యతగా ఉండాలని కోరుకుంటాం. ఈ విషయంలో ఎన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నా ఒక్కోసారి మోసపోతునే ఉంటాం. వస్తుమార్పిడి నుంచి వస్తు కొనుగోలు వరకు తరాలు మారినా కొందరు వ్యాపారులు, ఉత్పత్తిదారులు వినియోగదారులను ఏదో ఒక రకంగా మోసం చేస్తునే ఉన్నారు. వినియోగదారులకు పెట్టిన సొమ్ముకు సరిపడా నాణ్యమైన వస్తువులు దొరకని పరిస్థితి.

ఉత్పత్తిదారులు, అమ్మకందారుల మోసాల నుంచి వినియోగదారులు బయటపడాలంటే ఆ మోసాలను గుర్తించడం, వాటిపై ఫిర్యాదు చేయాల్సిన అవసరం ఉంది.

☛ వినియోగదారులు చైతన్యవంతమైనప్పుడే మోసాల నుంచి బయటపడతాం. అందుకు ప్రభుత్వం పలు చట్టాలను తీసుకొచ్చింది. వినియోగదారుల దినోత్సవం పేరిట ఏటా అవగాహన కార్యక్రమాలు చేపడుతోంది. 1986లో కేంద్ర ప్రభుత్వం వినియోగదారుల పరిరక్షణ చట్టాన్ని తీసుకువచ్చింది.

☛ మనం ఉదయం నుంచి సాయంత్రం వరకు వాడే పరికరాలు, ఆహారంలో నాసిరకమైనవి, కల్తీవి కోకొల్లలు. పెట్రోల్, డీజిల్, కిరోసిన్, గ్యాస్, తూనికలు, కొలతలు, ఏటీఎం మోసాలు, బ్యాంకులు, ఎలక్ట్రానిక్ పరికరాలు, వస్తువులు, పానియాలు, పదార్థాలు.. ఇలా ఒకటేంటి అన్ని రకాల వస్తువుల కొనుగోలు సమయంలో తరచూ మోసపోతుంటాం. వీటిని అధిగమించాలంటే అవగాహన చట్టాలు తెలుసుకోవడం అవసరం. మోసానికి గురైనట్లు భావిస్తే ఎవరిని ఆశ్రయించి ఫిర్యాదు చేయాలనే విషం తెలుసుండాలి. వీటి కోసం వినియోగదారుల ఫోరం, సంస్థలు, ప్రత్యేక న్యాయస్థానాలు అందుబాటులో ఉన్నాయి. వీటిని ఆశ్రయించి మోసాల నుంచి రక్షణ పొందాలి. మోసపోయిన సొమ్మును తిరిగి రాబట్టుకోవచ్చు.

నేడు కలెక్టరేట్‌లో..

జాతీయ వినియోగదారుల దినోత్సవం బుధవారం జరగనుంది. కలెక్టరేట్‌లో ఉదయం జరిగే ఈ సమావేశానికి వినియోగదారులు, అధికారులు పాల్గొంటారు.

కొత్తరకం మోసాలతో జాగ్రత్త..



ఇప్పటి వరకు జరిగిన మోసాలు ఒక రకమైతే.. ప్రస్తుతం టెక్నాలజీతో మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఆన్‌లైన్ మోసాలు, సైబర్ నేరాలు ఇటీవల పెరిగిపోయాయి. వీటిని అధిగమించేందుకు ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలి.

– బగాది రామ్మోహన్‌రావు, వినియోగదారుల సంఘాల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు